క్లుప్తంగా...

47 అంశాలకు పాలకవర్గం ఏకగ్రీవ తీర్మానం

బోడుప్పల్: బోడుప్పల్ నగర సంస్థ కార్యాలయంలో బుధవారం మేయర్ సామల బుచ్చిరెడ్డి అధ్యక్షతన జరిగిన సాధారణ సర్వసభ్య సమావేశంలో 47 అంశాలకు పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానించింది. సిబ్బంది జీతభత్యాలు, పారిశుద్ధ్య వాహనాల నిర్వహణ, కుక్కలకు ఆపరేషన్, ఎయిర్ టెక్, బకెట్ మెషిన్ ఎంగేజ్ చేయడం, నూతనంగా ఐదు ట్రాక్టర్ల కొనుగోలు, డంపింగ్ యార్డులో చెత్త తరలించేందుకు చెల్లించాల్సిన బిల్లులు, రోడ్లకు ప్యాచ్‌వర్క్ చేయడం, వక్ఫ్ బోర్డు భూముల సమస్య పరిష్కారానికి జిల్లా కలెక్టర్‌కు నివేదించడం తదితర అంశాలకు తీర్మానం చేశారు. వీటితోపాటు పలు అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ వాణిరెడ్డి, డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీరవిగౌడ్, మేనేజర్ మంజులత, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

కార్యకర్తలే పార్టీకి బలం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్



రామంతాపూర్: క్రమశిక్షణ కలిగిన పార్టీ కార్యకర్తలే బీజేపీకి బలమని, ప్రజలే మన బలగమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం రామంతాపూర్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావ్ గృహంలో పలువురు కార్యకర్తలు, ముఖ్య నేతలను ఆయన కలిశారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులు పార్టీ కార్యకర్తలతో ఫొటోలు దిగి సందడి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీజేపీలోని ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావ్, రేవు నరసింహ, సంతోష్, వెంకట్‌రెడ్డి, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

రామంతాపూర్: డివిజన్ పరిధిలోని శాంతినగర్‌లో కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావ్ బుధవారం జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను తెలుసుకున్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు తెలిపారు. జీహెచ్‌ఎంసీ డీఈ నాగమణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేందర్ పాల్గొన్నారు.

అలెక్సా వాడకంతో.. ఆంగ్ల భాషా నైపుణ్యం

సాక్షి, సిటీబ్యూరో: వాయిస్ కమాండ్స్ ఆధారంగా పనిచేసే అలెక్సా వినియోగం వల్ల చిన్నారుల్లో ఆంగ్ల భాషా పరిజ్ఞానం చెప్పుకోదగ్గ స్థాయిలో పెరుగుతోంది. ఈ విషయాన్ని అమెజాన్ సంస్థ కోసం కాంటార్ అనే సంస్థ నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. నగరంతో పాటు పలు ప్రాంతాల్లో నిర్వహించిన సర్వేలో అలెక్సా వల్ల తమ పిల్లల భాషా నైపుణ్యం మెరుగు పడినట్టు 95శాతం మంది తల్లిదండ్రులు అంగీకరించారని, అంతేగాకుండా సంగీతంపై ఆసక్తి, కొత్త విషయాలు నేర్చుకునే తత్వం వంటివి కూడా అలవడుతున్నాయన్నారు.

రిమాండ్ ఖైదీ పరార్

- రెండు గంటల్లో అదుపులోకి..



అర్జున్ నాయక్

అల్వాల్: కోర్టుకు హాజరుపర్చి తీసుకెళ్తున్న రిమాండ్ ఖైదీ పరార్ కాగా రెండు గంటల్లో పోలీసులు పట్టుకున్నారు. కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధి అశోక్‌నగర్‌లో ఉండే అర్జున్ నాయక్ (26) మైనర్ బాలికను కిడ్నాప్ చేసి వేధించిన ఘటనలో గతేడాది రిమాండ్‌కు తరలించారు. విచారణ నిమిత్తం బుధవారం జైలు సిబ్బంది నేరేడ్‌మెట్‌లోని మల్కాజిగిరి కోర్టుకు తీసుకొచ్చారు. కోర్టులో హాజరు పరిచిన అనంతరం తిరిగి జైలుకు తీసుకెళ్లే క్రమంలో వ్యాన్‌లో ఎక్కించగా అందులో నుంచి దూకి పరారయ్యాడు. గమనించిన పోలీసులు పలు ప్రాంతాల్లో వెతకగా అశోక్ నగర్‌లోని శ్రీనివాస హోటల్ సమీపంలో గుర్తించి అదుపులోకి తీసుకుని అర్జున్ నాయక్‌పై మరో కేసు నమోదు చేసి చర్లపల్లి జైలుకు తరలించారు.

బాలుడు అదృశ్యం



నరేష్ (ఫైల్)

అల్వాల్: మైనర్ బాలుడు అదృశ్యమైన ఘటన నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం సూర్యనగర్‌లో నివాసముండే పుష్పమ్మ కుమారుడు నరేష్ (16) ఆనంద్‌బాగ్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. 25వ తేదీన ఇంట్లో ఉన్న రూ.1.50 లక్షలను తీసుకొని వెళ్లి తిరిగి రాలేదు. తల్లి పలుచోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో నేరేడ్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రేడ్ లైసెన్స్ లేకుండానే..

జోరుగా వ్యాపారాలు

- షాపులు అధికం.. లైసెన్స్‌లు కనిష్టం
- పురపాలికల్లో ఆదాయానికి భారీగా గండి
- ఆదాయం పెంచడంలో యంత్రాంగం విఫలం
- ప్రతిఏటా ఏప్రిల్‌లో పునరుద్ధరణ తప్పని సరి
- పట్టించుకోని పురపాలకులు



సాక్షి, మేడ్చల్ జిల్లా: పురపాలక సంఘాల పరిధిలో ఎక్కడ పడితే అక్కడ వివిధ రకాల వ్యాపార సముదాయాలు ఉన్నప్పటికీ ఆ స్థాయిలో ట్రేడ్ లైసెన్సులను వ్యాపారులు తీసుకోవడం లేదు. దీంతో పురపాలక సంఘాలకు ప్రతిఏటా పెద్ద ఎత్తున ఆదాయానికి గండి పడుతోంది. నిబంధనల ప్రకారం ఏ దుకాణం నడపాలన్నా.. ట్రేడ్ లైసెన్సుకు పురపాలక సంఘాలకు తప్పని సరిగా వ్యాపారులు తగిన రుసుము చెల్లించి తీసుకోవాల్సి ఉంటుంది. కాగా.. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 13 పురపాలక సంఘాల్లో ట్రేడ్ లైసెన్స్ పొందాలని మున్సిపల్ అధికారులు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినప్పటికీ, లక్ష్యానికి దూరంగానే ఉంటున్నాయి. పురపాలక సంఘాల్లో వ్యాపార సముదాయాలు ఉన్నంతగా వ్యాపారులు లైసెన్సులు పొందడం లేదు.

ట్రేడ్ లైసెన్సులు జారీ చేయలేదా..?

మేడ్చల్ జిల్లా పరిధిలోని బోడుప్పల్‌లో 2,035 వ్యాపార సముదాయాలు ఉండగా, ట్రేడ్ లైసెన్సులు పొందిన దుకాణాలు(షాపులు) 455 మాత్రమే ఉన్నాయి. నిజాంపేటలో 4,354కు గానూ 2,135, జవహర్‌నగర్‌లో 750 గానూ 282, దుండిగల్‌లో 1248 గానూ 432, కొంపెల్లిలో 1,047 గానూ 256, నాగారంలో 1,211గానూ 265, పోచారంలో 411 వ్యాపార సముదాయాలకు గానూ 173 షాపులకు మాత్రమే ట్రేడ్ లైసెన్సులు ఉన్నాయి. ఈ ఏడు పురపాలక సంఘాల్లో మొత్తంగా 11,056 వ్యాపార సముదాయాలు ఉన్నట్లు మున్సిపల్ ఉద్యోగులు గుర్తించినప్పటికీ, ట్రేడ్ లైసెన్సులు 3,998 షాపులకు మాత్రమే ఉన్నాయి. దీన్ని బట్టి మున్సిపల్ అధికారులు గుర్తించిన మొత్తం దుకాణాల్లో కూడా 7,058 వ్యాపార సముదాయాలకు ట్రేడ్ లైసెన్సులు జారీ చేయలేదని తెలుస్తోంది. దీంతో పురపాలికల్లో ట్రేడ్ లైసెన్సుల జారీ విధానం ఎలా ఉందనే విషయం విధితమవుతోంది. అలాగే, మిగతా పీర్జాదిగూడ, దమ్మాయిగూడ, ఘట్‌కేసర్, గుండ్లపోచంపల్లి, మేడ్చల్, తూముకుంట పురపాలక సంఘాల్లో కూడా ట్రేడ్ లైసెన్స్ జారీ విధానం సక్రమంగా లేదన్న విషయం స్పష్టమవుతోంది.

ఆదాయానికి లక్షల్లో గండి

బ్యాంకులో రుణం తీసుకున్న వారు తప్ప మిగతా వ్యాపార సముదాయాలకు సంబంధించిన వారు ట్రేడ్ లైసెన్సులు పొందడానికి ఆసక్తి చూపడం లేదు. దీంతో పురపాలక సంఘాల ఆదాయానికి భారీగా గండి పడుతోంది. దీనిపై అధికార యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం ద్వారా పురపాలక సంఘాల్లో మరింత ఆదాయాన్ని పెంచాల్సిన అవసరం ఉంది. రోడ్ల వెంబడి హోటళ్లు, రెస్టారెంట్లు, ఆస్పత్రులు, కిరాణా దుకాణాలు, సెల్ పాయింట్లు, మొబైల్ షోరూంలు, వస్త్ర దుకాణాలు, ఆన్‌లైన్ సెంటర్లు తదితర వాణిజ్య సంస్థలు భారీగా పెరిగిపోయాయి. రోజురోజుకూ వ్యాపార, వాణిజ్య సంస్థలు పెరిగిపోతున్నా.. చాలామంది నిర్వాహకులు ట్రేడ్ లైసెన్స్ పొందడం లేదు. దీంతో పురపాలక సంఘాల ఆదాయానికి లక్షల్లో గండి పడుతోంది.

విలీన గ్రామాల్లో అంతంతే...

పురపాలక సంఘాల పరిధిలో ఉన్న విలీన గ్రామాల్లోనూ పెద్ద ఎత్తున దుకాణాలు, వ్యాపార వాణిజ్య సంస్థలు పెరుగుతూనే ఉన్నాయి. గతంలో ఉన్నవాటికి రెట్టింపు సంఖ్యలో కొత్తగా దుకాణాలు, వాణిజ్య వ్యాపార సంస్థలు వెలిశాయి. ఇందులో చాలా వాటికి ట్రేడ్ లైసెన్సులు పొందకుండానే వ్యాపార సముదాయాలను నిర్వహిస్తున్నారు.

రహదారుల ఆధారంగా రుసుం

పురపాలక సంఘాల పరిధిలో వ్యాపారం నిర్వహించుకునేందుకు విస్తీర్ణంతో సంబంధం లేకుండా ఫీజులు చెల్లించేవారు. కాగా ప్రభుత్వం మున్సిపాలిటీలకు ఆదాయం పెంచే ఉద్దేశంతో జీవో నంబరు 147 జారీ చేసింది. దీనిప్రకారం 20 అడుగులలోపు ఉన్న రోడ్డును సింగిల్ లేన్, 30 అడుగులలోపు ఉన్న రోడ్డును డబుల్ లేన్, 30 అడుగుల కంటే ఎక్కువగా ఉన్న రోడ్డును మల్టీపుల్ లేన్‌గా విభజించారు. ఆయా రోడ్లకు ఇరువైపులా ఉన్న దుకాణాల విస్తీర్ణాన్ని బట్టి చదరపు అడుగుకు కనిష్టంగా రూ.3, గరిష్టంగా రూ.7 చెల్లించి లైసెన్స్ తీసుకోవాలని నిబంధన పెట్టారు. దీంతో చాలామంది దుకాణాల నిర్వాహకులు లైసెన్సులు తీసుకునేందుకు ముందుకు రావడం లేదు. ప్రతి సంవత్సరం ఏప్రిల్‌లో దుకాణాల నిర్వాహకులు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్సు పునరుద్ధరించుకోవాలని పురపాలక సంఘాల కమిషనర్లు పేర్కొంటున్నారు. లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

సంపన్నులకు రాయితీలు.. పేదలపై భారం..

కుషాయిగూడ: తొమ్మిదేండ్ల మోదీ పాలన సంపన్నులకు రాయితీలు, పేదలపై భారం మోపుతూ సాగిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వీఎస్.బోస్ విమర్శించారు. బుధవారం మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ డివిజన్‌లో సీపీఐ ఉప్పల్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో ఇంటింటికీ సీపీఐ కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఇంటింటికీ తిరిగి బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రచారం చేశారు. బీజేపీ హటావో దేశ్ కో బచావో నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్య పరిచే విధంగా ప్రచారం సాగించారు. ఈ సందర్భంగా బోస్ మాట్లాడుతూ కార్పొరేట్, పెట్టుబడిదారుల కొమ్ముకాస్తూ కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేసిన ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు. ఉద్యోగ, ఉపాధి రంగాలను పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆరోపించారు. మోదీని గద్దె దించే వరకు మన పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ ఉప్పల్ నియోజకవర్గ కార్యదర్శి దామోదర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎన్. శంకర్‌రావు, లక్ష్మీనారాయణ, సత్యప్రసాద్, నర్సింహ, స్వామిదాస్, జాన్‌కుమార్, కృపాకర్, భిక్షపతి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



హెచ్‌బీకాలనీలో ఇంటింటికీ సీపీఐ కార్యక్రమంలో నేతలు

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

బోడుప్పల్: రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత ప్రవేశపెట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. 24వ డివిజన్ ఈస్ట్ జ్యోతినగర్ కమ్యూనిటీ హాల్ బుధవారం ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంధత్వ నివారణకు ప్రభుత్వం కృషి చేస్తోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన వస్తోందన్నారు. కార్యక్రమంలో 24వ డివిజన్ కార్పొరేటర్ గుర్రాల రమా వెంకటేశ్‌యాదవ్, కాలనీవాసులు పాల్గొన్నారు.



కంటి వెలుగు కార్యక్రమంలో మేయర్‌సామల బుచ్చిరెడ్డి

అంబేద్కర్‌నగర్‌లో సమస్యకు పరిష్కారం



నాలా వద్ద పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. అంబేద్కర్‌నగర్ నాలా పొంగిపొర్లింది. కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ స్పందించి అర్ధరాత్రి అధికారులను అప్రమత్తం చేసి నాలా వద్ద బ్రిడ్జి నిర్మాణం కోసం వేసిన కట్ట తొలగించడంతో సమస్య పరిష్కారమైంది. బుధవారం ఉదయం కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ అధికారులతో కలిసి బ్రిడ్జి వద్ద పనులను పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు సాయిజెన్‌శేఖర్, కట్ట బుచ్చన్నగౌడ్, నర్సింగ్‌రావు, జావీద్, హరిప్రసాద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీ-సేవ్ నిరుద్యోగ నిరాహార దీక్షకు తరలిన నేతలు



దీక్షలో వైఎస్ షర్మిలతో వైఎస్సార్‌టీపీ నేత రూపేందర్‌రెడ్డి

మల్లాపూర్: వైఎస్సార్ టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల ఆధ్వర్యంలో నగరంలోని ఇందిరాపార్కు వద్ద నిర్వహించిన టీ-సేవ్ నిరుద్యోగ నిరాహార దీక్షకు మల్లాపూర్ డివిజన్ వైఎస్సార్ టీపీ అధ్యక్షుడు కొకుట్ల రూపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో తరలివెళ్లి దీక్షకు మద్దతు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే

ఉప్పల్: ఉప్పల్ సాయిరాంనగర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం ప్రీస్కూల్‌లో బుధవారం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి ఉప్పల్ కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. ఐసీడీఎస్ అల్వాల్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బాల్య సంరక్షణ, విద్యలో భాగంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలలకు పట్టాలను పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పార్వతి, కాలనీ అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్ స్వరూప, మమత, శాంతి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న కార్పొరేటర్ రజితరెడ్డి

టీ-24 టికెట్స్‌పై రాయితీ

కాప్రా: టీఎస్ ఆర్టీసీ టీ-24 టికెట్స్‌పై గురువారం నుంచి జూన్ 15వ తేదీ వరకు 10 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు కుషాయిగూడ డిపో మేనేజర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రూ.100 ఉన్న టీ-24 టిక్కెట్ 10 శాతం రాయితీతో రూ.90, అదే విధంగా సీనియర్ సిటీజన్స్ (60 సంవత్సరాలు పైబడిన వారు) వారికి 20 శాతం రాయితీతో రూ.80 ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని జంట నగరంలో నివసిస్తున్న ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెండింగ్ పనులపై సమీక్ష సమావేశం

ఉప్పల్: పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ జీహెచ్‌ఎంసీ ఈఈ నాగేందర్, డీఈ నిఖిల్‌రెడ్డితో కలిసి బుధవారం సర్కిల్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటికే ప్రారంభించిన పనులను వెంటనే పూర్తిచేయాలని కోరారు. కుమ్మరికుంట నుంచి ఎస్సీ కమ్యూనిటీ హాల్, విజ్ఞాన్ గ్రామర్ స్కూల్ నుంచి మల్లికార్జున్ నగర్, బీరప్పగడ్డ నుంచి రామాలయం, శ్రీనగర్ కాలనీ, బీరప్పగడ్డ కమ్యూనిటీ హాల్ నుంచి కావేరినగర్ కాల్వ వరకు పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను కోరారు. దీంతో పాటు కళ్యాణపురి టీచర్స్ కాలనీ నుంచి సీతారామకాలనీ, ఎన్‌జీఆర్ కాంపౌండ్ వాల్ వరకు సీసీ రోడ్డు ప్రతిపాదనలను వెంటనే పంపాలని కోరారు. అందుకు అధికారులు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, జగన్, కొండల్‌రెడ్డి, రామానుజ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



ఆనంద్‌రావునగర్ కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి

అల్వాల్: అల్వాల్ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని స్థానిక కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని ఆనంద్‌రావునగర్‌లో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో నీటి ఇబ్బందులు, ఓపెన్ డ్రెయిన్‌ను కవర్ చేసేందుకు ప్రీకాస్ట్ స్లాబ్‌ల ఏర్పాటుతోపాటు కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు, వీధి దీపాల ఏర్పాటు తదితర అంశాలను గుర్తించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

దీనదయాల్‌నగర్‌లో కార్పొరేటర్ పర్యటన

మౌలాలి: డివిజన్ పరిధిలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పలు కాలనీలు జలమయమయ్యాయి. గురువారం ఉదయం కార్పొరేటర్ గున్నాల సునీతశేఖర్‌యాదవ్ పర్యటించారు. పలు ఇళ్లలోకి వర్షపు నీరు చేరి ఇబ్బందులు ఎదుర్కొన్నామని కాలనీవాసులు కార్పొరేటర్‌కు తెలిపారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ముందు సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆమె అధికారులకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



దీనదయాల్‌నగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ సునీత

మే డే పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి మల్లారెడ్డి

మల్లాపూర్: తెలంగాణ రాష్ట్ర ఇండస్ట్రియల్ ట్రేడ్ యూనియన్ (టీఎస్ఐటీయూ), భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ (బీఆర్‌టీయూ) సంయుక్తాధ్వర్యంలో రూపొందించిన మే డే పోస్టర్‌ను బుధవారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్, ప్రధాన కార్యదర్శి నారాయణ, ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వేముల మారయ్య, బురుగు మారుతీరావు, బీఆర్ఎస్ నాయకులు కుంటి కృష్ణ, మారుతిప్రసాద్, యూనియన్ నాయకులు సాయికుమార్, అశోక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ మర్రిగూడలోని బస్తీ దవాఖానాను బుధవారం కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. బస్తీ దవాఖానాలో అందిస్తున్న సేవలను స్థానిక ప్రజలు వినియోగించుకోవాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు బాధితుల సమస్యను పరిష్కరించాలంటూ ధర్నా

బోడుప్పల్: నగర పాలక సంస్థ పరిధిలో వక్ఫ్ బోర్డు బాధితుల సమస్యను పరిష్కరించాలని కోరుతూ పలువురు వక్ఫ్ బోర్డు బాధిత జేఏసీ కుటుంబ సభ్యులు బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రిజిస్ట్రేషన్ ఉన్నా ప్లాట్లలో ఇంటి అనుమతులు మంజూరు చేయాలని, రిజిస్ట్రేషన్లు యధావిధిగా కొనసాగేటట్లు చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. కౌన్సిల్ సమావేశంలో ఉన్న అధికారులు, పాలకవర్గ సభ్యులు ఎవరూ స్పందించకపోవడంతో బాధితులు కౌన్సిల్ సమావేశంలోకి వెళ్లి నిరసన తెలిపారు. ప్రతిపక్ష కార్పొరేటర్లు పోగుల నర్సింహరెడ్డి, కొత్త ప్రవంతిగౌడ్, కుంభం కిరణ్‌కుమార్‌రెడ్డి, సామల పవన్ రెడ్డి, కొత్త దుర్గమ్మ వారికి మద్దతు తెలిపారు. వెంటనే అనుమతుల కోసం పాలకవర్గం తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు, పాలకవర్గం తీర్మానం చేసి కలెక్టర్‌కు పంపనున్నట్లు వెల్లడించారు. దీంతో జేఏసీ నాయకులు నిరసన విరమింపజేశారు. కార్యక్రమంలో జేఏసీ కో చైర్మన్లు కొత్త కిశోర్‌గౌడ్, గోనె శ్రీనివాస్, విజయకుమార్ పాల్గొన్నారు.

పర్మనెంట్ ఉద్యోగులుగా గుర్తించాలి

రెండోరోజు కొనసాగిన ఆర్టిజన్ల సమ్మె

కుషాయిగూడ: న్యాయమైన డిమాండ్ల కోసం సమ్మెబాట పట్టిన ఆర్టిజన్ల సమ్మె రెండోరోజు బుధవారం కూడా కొనసాగింది. సైనిక్‌పురి డివిజన్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి అసెంబ్లీ సాక్షిగా ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని ప్రకటించినప్పటికీ యజమాన్యం ఇప్పటి వరకు పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించడం లేదన్నారు. పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించే వరకు రాష్ట్రవ్యాప్తంగా సమ్మె కొనసాగుతుందన్నారు. విద్యార్హతలను బట్టి కన్వర్షన్ ఇవ్వాలని, యాభైశాతం పీఆర్‌సీని అమలు చేసి కార్మికులందరికీ గుర్తింపు కార్డులను అందజేయాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా ఆర్టిజన్ల సమ్మెతో మంగళవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షానికి దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను పునరుద్ధరించకపోవడంతో పలుచోట్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కై వల్యం, సంజీవ, బాల్‌రెడ్డి, జానయ్య, మల్లారెడ్డి, ఉపేందర్‌రెడ్డి, నరేష్‌గౌడ్, బాలరాజు, రాంమోహన్, భాస్కర్, నవీన్ పాల్గొన్నారు.



ప్రతి గింజను కొనుగోలు చేస్తాం

జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి

ఘట్‌కేసర్: రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి అన్నారు. బుధవారం మాదారం, ఏదులాబాద్‌లో అదనపు కలెక్టర్ నరసింహారెడ్డి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డితో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులు నష్టపోకుండా ఏ గ్రేడ్ రకం ధాన్యానికి రూ.2,060లు, కామన్ గ్రేడ్ రకం ధాన్యానికి రూ.2,040ల మద్దతు ధర చెల్లిస్తున్నామన్నారు. అనంతరం రైతుల విన్నపం మేరకు అదనపు కలెక్టర్ నరసింహారెడ్డి వర్షంతో నష్టపోయిన వరి పంటను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టంపై నివేదికను అందజేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి, పౌరసరఫరా శాఖ ఎండీ రాజేందర్, మార్కెటింగ్ మేనేజర్ పాండురంగం, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, రైతుబంధు కమిటీ జిల్లా అధ్యక్షుడు నందారెడ్డి, సభ్యుడు భిక్షపతిగౌడ్, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొండల్‌రెడ్డి, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ రాంరెడ్డి, డైరెక్టర్లు లక్ష్మారెడ్డి, ధర్మారెడ్డి, వెంకటేశ్, ఉదయ్‌కుమార్‌రెడ్డి, సర్పంచులు వెంకటేశ్‌గౌడ్, యాదగిరి, ఉప సర్పంచ్ లింగేశ్వర్‌రావు, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ కుమార్‌ముదిరాజ్, ఆంజనేయులుముదిరాజ్, మండల వ్యవసాయాధికారి భాసిత్, సహాయ అధికారి సురేశ్‌రెడ్డి పాల్గొన్నారు.



ఏదులాబాద్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, చిత్రంలో అదనపు కలెక్టర్ నరసింహారెడ్డి